క్లుప్తంగా

సత్యనారాయణస్వామి ఆలయంలో శాంతి కల్యాణం



కంకిపాడు: పట్టణంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా చేశారు. సోమవారం సామూహిక సత్యదేవ వ్రతాలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. 2వ తేదీ స్వామి వారి అన్నప్రసాదాన్ని పంపిణీ చేయడానికి ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తం



కంకిపాడు: ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని లైఫ్‌కేర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.మునిరామయ్య అన్నారు. పట్టణంలోని ఒకటో తూము సమీపంలోని ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ వ్యాధులు, గుండె సంబంధ సమస్యలకు ఈసీజీ, ఇతర వైద్య సేవలను అందించారు. 250 మంది రోగులకు వైద్య సేవలు అందించి మందులు ఉచితంగా అందించారు. డాక్టర్ మునిరామయ్య మాట్లాడుతూ జీవనశైలి మార్పుతో వచ్చే వ్యాధులు ప్రాణాంతకంగా మారుతున్నాయన్నారు. డాక్టర్ కె.ప్రసన్న, డాక్టర్ షణ్ముఖ్, డాక్టర్ పర్వీన్, డాక్టర్ రషీద్‌లు వైద్య సేవలు అందించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



కంకిపాడు: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. లాకురోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 330వ ఆరాధనోత్సవాలు చేశారు. ఉత్సవమూర్తులకు పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సహస్ర నామార్చన, జ్యోతి దర్శనం, సమాధి పూజ భక్తిశ్రద్ధలతో చేయించారు. అనంతరం అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాలను కొండిపర్తి లీలా జయ కృష్ణమాచార్యులు, అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసరావు, చలపాక గురు, బ్రహ్మం, వనమోజు శ్రీనివాస్, కోడూరు మురళీకృష్ణ, పర్యవేక్షించారు.

గన్నవరంలో..


గన్నవరం: స్థానిక శ్రీకృష్ణనగర్‌లోని శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబుల సత్యనారాయణ, కార్యవర్గం పుట్టా రాంబ్రహ్మం, అంబుల విష్ణుమూర్తి, విశ్వనాధుల శేషచారి, నందిగం నవరత్నచారి, వజ్రాల రాంబాబు, రాపాక వెంకటచారి, పుట్టా సర్వేశ్వరరావు, చిత్రోజు సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం ఘటనపై కేసు

కంకిపాడు: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం అర్ధరాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గొల్లగూడెంకు చెందిన వెన్నా సుబ్బారావు ఆటోనగర్‌లో ఎస్ఆర్ ఇంజినీరింగ్ వర్క్స్ షాపు నిర్వహిస్తున్నాడు. దుకాణం మూసివేసి శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా పునాదిపాడు-గొల్లగూడెం మార్గమధ్యంలో వెనుకగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు సుబ్బారావు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి అనంతరం అరటి కాయలు కోసే కత్తితో విచక్షణారహితంగా దాడిచేశారు. తీవ్రగాయాలతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు వైద్యం నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. హత్యాయత్నం ఘటనపై కేసు నమోదు చేశారు. స్థానికంగా ఉన్న సీసీ పుటేజీ సేకరించి దాడికి పాల్పడ్డ వ్యక్తులను పోలీసులు గుర్తించారు. పాత కక్షలు, ఆర్థికపరమైన గొడవల కారణంగా హత్యాయత్నం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

వేగంగా ఇంటి పన్ను వసూళ్లు

- పెనమలూరు మండలంలో ముందంజ
- వంద శాతం పన్నులు వసూలు చేసిన 'చోడవరం'



పెనమలూరు మండల పరిధిలోని గృహాలు

పెనమలూరు: మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగంగా జరుగుతున్నాయి. మండలంలోని చోడవరం పంచాయతీలో వంద శాతం పన్నులు వసూలు చేశారు. నగర శివారులో గ్రామాలు ఉండటంతో ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతుంది. గతంలో ఇంటి పన్నుల వసూళ్లలో గ్రామ పంచాయతీలు వెనుక పడగా, ఇప్పుడు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతో గతంలో ఉన్న బకాయిల శాతం తగ్గింది. మండలంలో గత బకాయితో కలిపి వసూలు చేయల్సిన పన్నులు రూ 3,13,26,253 ఉండగా, ఇప్పటివరకు రూ 2,23,65,018 పన్నులు వసూళ్లు చేశారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వివరాలు ఇలా ఉన్నాయి

చోడవరంలో వంద శాతం

చోడవరంలో వంద శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేశారు. మూడేళ్లుగా చోడవరంలో నూరు శాతం పన్నులు వసూళ్లు చేసి గ్రామం ఆదర్శంగా నిలిచింది. గోసాల, వణుకూరు, పెదపులిపాక గ్రామాలు కూడా పన్నుల వసూళ్లలో ముందంజలోనే ఉన్నాయి. అయితే పెనమలూరు గ్రామం పన్నుల వసూలులో చాలా వెనుక పడింది. గ్రామంలో పన్నులు కేవలం 59.02 శాతం మాత్రమే వసూలు చేశారు. గతంలో ఇక్కడ బిల్లు కలెక్టర్‌గా పని చేసిన షంషుద్దీన్ రూ. 47 లక్షల పన్నులు వసూలు చేసి లెక్కలు చెప్పక పోవటంతో దీని పై విచారణ జరుగుతోంది. మండల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం ఇంకా రూ. 89 లక్షలు వసూలు చేయాల్సి ఉంది.

గ్రామం	పన్ను బకాయి	వసూలు చేసిన పన్ను	వసూళ్ల శాతం
పెదపులిపాక	రూ 48,86,881	రూ 39,26,757	80.35.
పెనమలూరు	రూ 1,49,70,432	రూ 88,35,618	59.02.
వణుకూరు	రూ 22,20,250	రూ 18,83,742	84.84.
చోడవరం	రూ 11,68,256	రూ 11,68,256	100
గంగూరు	రూ 56,15,210	రూ 42,36,409	75.45
గోసాల	రూ 24,65,224	రూ 23,14,236	93.88

ప్రత్యేక దృష్టి

ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గత బకాయి పన్నులు కూడా వసూలు చేస్తున్నాం. గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చి గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడతాం.

– కోరా శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ, పెనమలూరు మండలం

రైతన్నకు అకాల కష్టం

- ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- నీటమునిగిన పసుపు కొమ్ములు
- తడిసిన ధాన్యం, మొక్కజొన్న రాశులు



ఈడుపుగల్లులో ధాన్యం బస్తాలు తడవకుండా కప్పిన పరదాలు

కంకిపాడు(పెనమలూరు): అకాల వర్షం అన్నదాతలను వణికిస్తోంది. చేతికొచ్చిన పంట నోటికి దక్కకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ద్రోణి ప్రభావంతో వరుసగా రెండో రోజైన ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మబ్బులతో నిండి మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాన పడింది.

పంట చేతికొస్తుండనగా..

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చింది. ప్రస్తుతం పసుపు పంట మార్కెట్‌కు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పసుపు కొమ్ములు ఉడికించి ఎండబెట్టి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. అదే క్రమంలో రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న ఇతర పంటలను సాగు చేశారు. ప్రస్తుతం ధాన్యం, మొక్కజొన్న పంట మార్కెట్‌కు చేరుతోంది. ఎక్కడ చూసినా ఆరబోసిన ధాన్యం రాశులు, బస్తాలకు ఎత్తిన ధాన్యం, మొక్కజొన్న రాశులే కనిపిస్తున్నాయి. అకాల వర్షంతో రైతుల నెత్తిన పిడుగు పడినట్లయ్యింది. కల్లాలు, బహిరంగ ప్రాంతాల్లో పోసిన ధాన్యం, మొక్కజొన్న రాశులు వర్షానికి చెమ్మగిల్లాయి. ఎండబెట్టిన పసుపు వర్షానికి తడిసి పోయింది. కల్లాల్లో నీరు చేరటంతో పసుపు కొమ్ములు నీళ్లల్లో తేలుతున్నాయి. ప్రొద్దుటూరు, మద్దూరు, తోట్లవల్లూరు లంక గ్రామాల్లో పసుపు కొమ్ములు వర్షానికి తడిచిపోవటంతో నాణ్యత దెబ్బ తింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు పరదాలు కప్పే చర్యల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తుండటంతో గండం గట్టెక్కితే చాలని భగవంతుడిని వేడుకుంటున్నారు.

హైస్కూల్‌కు స్థలం కేటాయించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీమౌనిక, సభ్యులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆ గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని జగనన్న లేఅవుట్ పరిశీలించేందుకు శనివారం వచ్చిన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను కొంత కాలం క్రితం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించారని తెలిపారు. సుమారు 850 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు అవసరమైన తరగతి గదులు, సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. జెడ్పీ హైస్కూల్ శాశ్వత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. సర్పంచి విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ స్థల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దారుకు ఆదేశాలు జారీచేశారని వివరించారు. వార్డు సభ్యులు మూల్పూరు మాధవ స్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే వంశీ



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆటలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించ తలపెట్టిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే వంశీ ఆదివారం ప్రారంభించారు. వేలేరు ఎంపీటీసీ సభ్యుడు యోహాన్ బాబు నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో మండలంలోని పలు గ్రామాల నుంచి జట్లు పాల్గొన్నాయి. తొలి మ్యాచ్ ప్రారంభానికి ముందుగా ఎమ్మెల్యే వంశీ కొద్దిసేపు క్రికెట్ బ్యాట్ పట్టుకుని ఆడుతూ యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, ఎంపీపీ యర్లగొర్ల నగేష్, బాపులపాడు, వేలేరు సర్పంచ్‌లు సరిపల్లి కమలాభాయి, చొదిమెళ్ల సుందరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మా విజయ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో గవర్నింగ్ బాడీ కన్వీనర్ సాంబశివరావు

గన్నవరం రూరల్: విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ సింగ్‌నగర్ డివిజన్ నూతన అధ్యక్షురాలిగా ముస్తాబాద నవభారత్ హైస్కూల్ ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా ఎన్నికయ్యారు. ఆదివారం ముస్తాబాదలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శిగా అవుతు అనురాధ, కోశాధికారిగా నీలపు మాధవి ఎన్నిక కాగా గవర్నింగ్ బాడీ కన్వీనర్ జి.సాంబశివరావు వారితో ప్రమాణస్వీకారం చేయించారు. జాకీరా సుల్తానా మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో డివిజన్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని గత కార్యవర్గం శారకుమారి, లక్ష్మీ శ్రీనివాస్, కుసుమ, సత్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు అనుమాటి చెన్నయ్య, ఆరుమళ్ళ మోహన్‌రెడ్డి, తాళ్ళూరి శ్రీనివాసరావు, షేక్ ఇమాం, స్లీవా, వి.ఆదినారాయణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిత్యం యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా ఉచిత శిక్షణా తరగతులను ఆదివారం ఉదయం ఢిల్లీరావు ప్రారంభించారు. యోగ సాధకులతో కలిసి ఢిల్లీరావు కొద్దిసేపు యోగాసనాలు, ప్రాణాయామం ప్రాక్టీస్ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యోగా సాధన వల్ల శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ధృడంగా ఉండవచ్చునన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో మానసిక ఒత్తిడి అనేది అనివార్యంగా మారిందని, దాని వల్ల వ్యాధులు కూడా చాలా తేలికగా శరీరంలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగ సాధన ఒక్కటే మార్గమన్నారు. పూర్వీకులు యోగ సాధన చేసి ఎటువంటి వ్యాధులు లేకుండా సంపూర్ణ ఆయుష్‌తో జీవించారన్నారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటుగా క్రమశిక్షణ, సమయపాలన, మానసిక ప్రశాంతత పొందవచ్చునని చెప్పారు. జిల్లాలోని 257 ఆరోగ్య కేంద్రాల్లో కూడా వివిధ రకాల వైద్య విధానాలతో పాటుగా యోగాను కూడా ఒక అంశంగా చేర్చామని ఢిల్లీరావు చెప్పారు. ప్రపంచంలోని పాశ్చాత్య దేశాలల్లో సైతం యోగాను సర్వరోగ నివారిణిగా భావిస్తున్నారని చెప్పారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కువ మందికి యోగాను పరిచయం చేసేందుకు ప్రతి ఏడాది వేసవిలో ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగ సాధన వల్ల దీర్ఘకాలిక వ్యాధులను సైతం మందులు ఉపయోగించకుండా అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. నెల రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఈ యోగా శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఏపీ యోగా లీగ్ చీఫ్ కో-ఆర్డినేటర్ జీ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యోగ ప్రాధాన్యతను ప్రపంచం మొత్తం గుర్తించడం మన దేశానికి గర్వకారణమన్నారు. అసోసియేషన్ సభ్యులు చుక్కపల్లి అరుణ్‌కుమార్, మిరియాల వెంకటేశ్వరరావు, యల్లారావు తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం యోగా గురువు అంకాల సత్యనారాయణను ఢిల్లీరావు సత్కరించారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



కంకిపాడు: ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. నెప్పల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు అమ్ముల సుబ్రహ్మణ్యం స్వచ్ఛంద పదవీ విరమణ చేయటంతో ఆదివారం స్థానిక పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటేలా సుబ్రహ్మణ్యం చూపిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.శ్రీనివాసరావు, స్థానికులు చలసాని భాగ్యనిరంజనరావు, కొణతం గిరిధర్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పి.సుధాకర్, ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తంబి చర్చికి ఫాదర్ల నియామకం



ఉంగుటూరు: మండలంలోని పెద అవుటపల్లి బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రంలోని ఆర్‌సీఎం చర్చికి నూతనంగా ఫాదర్లు జోసఫ్, అభిలాష్, కిశోర్, జయప్రసాద్, రవిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా విచారణ పరిధిలోని పెద అవుటపల్లి, చిన్న అవుటపల్లి, తుట్టగుంట, పొట్టిపాడు, ఆత్కూరు గ్రామాల విశ్వాసులు ఫాదర్లకు ఆదివారం ఘనస్వాగతం పలికారు. నూతన ఫాదర్లు నేరుగా తంబి సమాధి వద్దకు చేరుకుని అక్కడ నుంచి కళావేదిక వద్ద దివ్య పూజాబలని సమర్పించారు. వైస్ ప్రొవింషియల్ ఫాదర్ ప్రవీణ్‌గోపు మాట్లాడుతూ ఫాదర్లు, సంఘస్తులు అందరు ఐక్యంగా జీవిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి ఉంటుందని అన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు దాతల సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో దాతలు రూ.30 వేల విలువైన వస్తువులను వితరణగా అందించారని ప్రధానోపాధ్యాయులు బి.సుదర్శనం ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన అక్కినేని వెంకట కృష్ణామూర్తి జ్ఞాపకార్థం ఆయన మనుమరాలు సుభద్రదేవి రూ.15 వేలు విలువ చేసే పోడియం అందించినట్లు చెప్పారు. చిలుకూరి నాగేశ్వరరావు, సత్యవతి జ్ఞాపకార్థం కుమారుడు శేషు, కుమార్తె పద్మ రూ.15 వేలు విలువ చేసే ఇనుప బీరువాలను పాఠశాలకు అందించారని తెలిపారు. దాతలకు ప్రధానోపాధ్యాయుడు సుదర్శనం, ఇతర ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

అత్తింటివారిపై వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు వినాయక్‌నగర్‌కు చెందిన ఈడే లావణ్య గతేడాది క్రితం మచిలీపట్నానికి చెందిన ఈడే అనీల్‌కుమార్‌ను వివాహమాడింది. పెళ్లి సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. ఇచ్చిన కట్నం చాలలేదని, అదనపు కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్త పద్మ, మామ శేషగిరిరావు, బంధువులు మొక్కాదీప్తి, రాజులపాటి సుందరయ్య, అనూషారాణి, కె.విఘ్నేషు, నందినిదేవి, కుమార్, శిరీషపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

నేడు అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు) స్థానిక మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్ సమీపంలోని తమ సంస్థ ఆవరణలో సోమవారం ఉదయం 11.30 గంటలకు కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి, ఎంబీవీకే భవన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పి.క్రాంతికుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.

వైభవంగా 'వాసవి' అమ్మవారి జయంతి



వాసవీ మాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు



యనమలకుదురులో సామూహిక కుంకుమార్చనలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రీ వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వైభవంగా నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, కరెన్సీనగర్, మురళీనగర్ నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత పుట్టింటి సారెను మేళతాళాలతో తీసుకువచ్చి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమను అమ్మవారికి సమర్పించారు. అనంతరం పేరంటాలమ్మ ఆలయం నుంచి 102 కలశములతో 102 మంది సుహాసినిలు ప్రసాదంపాడు కోదండరామాలయం దగ్గరకు వెళ్లి తిరిగి అమ్మవారి గుడి వద్దకు రంగ రంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు.

తాళ్లాయపాలెం శ్రీ శైవక్షేత్రం నుంచి తీసుకొచ్చిన అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, 102 ప్రత్యేక హారతులు ఇచ్చారు. అనంతరం కుంకుమ పూజలు చేశారు. 60 వసంతాలు పూర్తి చేసుకున్న 16 మందిని సన్మానించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ, వాసవీ సేవా సంఘం సెక్రటరి శిఖాకొల్లి యల్లమందయ్య, జూలూరు నాగేశ్వరరావు, పురిమి సుబ్రహ్మణ్యం, కోట రామకృష్ణారావు, మాదాల వెంకట రమేష్, కొత్త వెంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరులో..

పెనమలూరు: యనమలకుదురులో ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా చేశారు. గ్రామంలోని పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన శ్రీరుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం 10 గంటలకు గణపతి పూజ, కలశ పూజ జరిగాయి.

పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బతి శ్రీరాములు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాచూరి ఆంజనేయులు, కార్యదర్శి ఓబుల శెట్టి వీరాంజనేయులు, చక్కా లక్ష్మణనాయుడు, కొప్పవరపు సూర్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పోరంకి శ్రీ వాసవి క్లబ్ నవనిర్మాణ కపుల్స్ భక్తులకు సేవలు అందించారు.

ఆనందోత్సాహాలతో అ'పూర్వ' సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గన్నవరం రూరల్: పూర్వ విద్యార్థులు పాఠశాలకు తరగని ఆస్తి అని ముస్తాబాద జెడ్పీహైస్కూల్ హెచ్ఎం ఎంవీ సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక పాఠశాలలో 1981–82 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ 41 సంవత్సరాల తరువాత వారందరూ ఒక్కటై కలసి అనుభూతులు పంచుకున్నారు. జీవితాల్లో స్థిరపడిన విషయాలు చర్చించి చదువుకునే రోజుల్లో తీపి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతుగా అండగా నిలుస్తామని చెప్పారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సీతారామయ్య, గూడపాటి లక్ష్మీనారాయణ దంపతులను, కడియాల గోపాలరావును, హెచ్ఎం సుబ్బారావును సత్కరించారు. గురువులు ఆనందం వ్యక్తం చేసి దీవించారు. పూర్వ విద్యార్థులు కుటుంబాలతో కలసి పాల్గొన్నారు.

వైద్యులు నిరంతర అధ్యయనం చేయాలి



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న డాక్టర్ సుధా నాగేశ్వరరావు

గన్నవరం రూరల్ : వైద్యులు నిరంతర అధ్యయనంతో సేవలందించాలని సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో ప్రసూతి, గైనకాలజీ, యూరాలజీ, అనాటమి విభాగాలు, విజయవాడ ప్రసూతి అండ్ గైనకాలజీ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో పెల్విక్ శస్త్ర చికిత్సలలో అధిక రక్త స్రావం జరిగినప్పుడు చేపట్టవలసిన విధానంపై వైద్యులకు వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శస్త్రచికిత్సల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలంటే ఈ విధమైన వర్క్‌షాప్‌లు నిరంతరం జరగాలని, నిపుణులైన వైద్యులు చెప్పే విధానాలు, సలహాలు పాటించాలన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బృందం, పెల్విక్ శస్త్ర చికిత్స వైద్యులు ఇంటర్నల్ ఇలియాక్ ఆర్టరీలిగేషన్, యురేటిరిక్ డిసెక్షన్ అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సుధా నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, డాక్టర్ సజన గోగినేని, డాక్టర్ సుశీల, డాక్టర్ సూర్య కుమారి, డాక్టర్ స్వాతి పూర్ణిమ పాల్గొన్నారు.